డెంగ్యూతో చిన్నారి మృతి

రుషిత (ఫైల్)

హుజూరాబాద్, సెప్టెంబర్ 30 : డెంగ్యూతో పదేండ్ల చిన్నారి మృతి చెందింది. ఈ ఘటన కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో సోమవారం చోటుచేసుకున్నది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన రావుల వెంకటేశ్వర్లు, రజని దంపతులకు కొడుకు, కూతరు రుషిత(10) ఉన్నారు. రుషితకు వారం రోజుల క్రితం జ్వరం రాగా స్థానిక వైద్యులకు చూపించారు. జ్వరం తగ్గకపోవడంతో రెండ్రోజుల క్రితం మెరుగైన వైద్యం కోసం హనుమకొండకు తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షలు చేసి డెంగ్యూ అని నిర్ధారించారు. వైద్యం చేస్తుండగానే రక్తకణాలు పూర్తిగా పడిపోవడంతో బాలిక మృతిచెందింది. అల్లారు ముద్దుగా చూసుకుంటున్న కూతురు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. రిషిత గ్రీన్ సెడ్జ్ (వీపీఎస్) స్కూల్‌లో నాలుగో తరగతి చదువుతున్నది.

స్కూల్ బస్సు ఢీకొని చిన్నారి దుర్మరణం

మనోజ్ఞ (ఫైల్)

ముస్తాబాద్, సెప్టెంబర్ 30 : స్కూల్లో ముందస్తు బతుకమ్మ వేడుకల కోసం కొత్త దుస్తులు ధరించి సంతోషంగా వెళ్లిన చిన్నారి అదే స్కూల్ బస్సు కిందపడి ప్రాణాలు విడిచింది. ఈ విషాదకర ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్‌లో సోమవారం జరిగింది. ముస్తాబాద్ మండలం నామాపూర్‌కు చెందిన భూమ రాజు – వెంకటలక్ష్మి దంపతులకు కూతు రు మనోజ్ఞ (5) ముస్తాబాద్‌లోని మహర్షి స్కూల్లో నర్సరీ చదువుతున్నది. సోమవారం బస్సులో స్కూల్‌కు వెళ్లింది. బస్సు దిగి వెనుక నుంచి వెళుతున్న క్రమంలో డ్రైవర్ చూడకుండా రివర్స్ తీయడంతో చిన్నారి వెనుక టైర్ల కింద పడి అక్కడికక్కడే మృతిచెందింది. విషయం తెలుసుకున్న ఎస్‌ఎఫ్‌ఐ, ఏబీవీపీ, డీవైఎఫ్‌ఐ, ఎన్‌ఎస్‌యూఐ నాయకులు పాఠశాల ఎదుట ధర్నాకు దిగారు.

సోమవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, మహమూద్ అలీ, గంగుల, ఎంపీ వద్దిరాజు, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు తదితరులు

కాంగ్రెస్‌కు మూసీ బ్యాంకు

2400 కి.మీ. 'నమామి గంగ'కు 40 వేల కోట్లు • 55 కిలోమీటర్ల మూసీకి 1.50 లక్షల కోట్లా? • మూసీ బాధితుల పాలిట కాలయముడిలా రేవంత్

రెడ్‌లైన్లు వేసుడు కాదు.. డెడ్‌లైన్లు పెడుతం • ఢిల్లీ పార్టీలను గెలిపిస్తే గల్లీ ప్రజలకు ఆక్రందనలే • బుల్డోజర్‌కు అడ్డుగా నిలుస్తాం: కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ సర్కార్ చెప్తున్న మూసీ సుందరీకరణ ప్రాజెక్టు దేశంలోనే అతిపెద్ద కుంభకోణమని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. వచ్చే సాధారణ ఎన్నికల కోసం ఈ ప్రాజెక్టు కాంగ్రెస్‌కు రిజర్వ్ బ్యాంకులా, ఏటీఎంలా ఉపయోగపడుతుందని దుయ్యబట్టారు. మూసీ ప్రాజెక్టును ఎవరి కోసం చేపడుతున్నారో చెప్పాలని, అసలు కాంగ్రెస్ సర్కార్ ప్రాధాన్యాలు ఏమిటో చెప్పాలని నిలదీశారు. 300 రోజులైనా కాంగ్రెస్ హామీలు అమలు కావడంలేదని, ఇచ్చిన హామీలను పక్కనపెట్టి ప్రజలకు అక్కరకు రాని అంశంపై లక్షన్నరకోట్లు ఖర్చు పెట్టడం ఎవరికోసమని ప్రశ్నించారు. పేదల పక్షాన హైకోర్టుకు ధన్యవాదాలు తెలుపుతున్నామని చెప్పారు. తెలంగాణ భవన్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 'రెండు వేల పింఛన్ నాలుగు వేలవుతుందని, రెండు లక్షల రుణమాఫీ అని, తులం బంగారంతో కల్యాణలక్ష్మిని అమలు చేస్తామని, 10వేల నుంచి 15 వేలకు రైతుబంధు పెంచుతామని, ఆటో డ్రైవర్లకు నెలకు వెయ్యి, మహిళలకు రూ.2500 ఇస్తామని చెప్పారు.. వీటికి మాత్రం పైసల్లేవు, చేతులు రావు.. ఇవన్నీ ఎప్పుడు అమలు చేస్తారో స్పష్టత ఇవ్వకుండా అక్కరకు రాని, అక్కరలేని, ప్రజలు కోరుకోని సుందరీకరణ కోసం, ఏ ప్రాధాన్యం లేకుండా రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు పెడుతామంటే ప్రభుత్వం, ముఖ్యమంత్రి ఇందులో ఏం ఆశించి చేస్తున్నారో చెప్పాలి' అని నిలదీశారు. ఓవైపు ఖజానాలో పైసల్లేవంటూనే అప్పుల కోసం అప్పులు తేవాల్సి వస్తున్నదని ఉప ముఖ్యమంత్రి చెప్తున్నాడని, ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చలేదని మండిపడ్డారు. '25వేల కుటుంబాలు, లక్ష మందిని నిరాశ్రయులను చేసేందుకు మూసీ బాధితుల పాలిట ముఖ్యమంత్రి కాలయముడిలా మారాడు' అని మండిపడ్డారు. నేరం చేసిందెవరు? శిక్ష ఎవరికి వేస్తున్నారు? అని ప్రశ్నించారు. 1994లో కాంగ్రెస్ సర్కార్ ఉన్నప్పుడే పట్టాలిచ్చారని, రిజిస్ట్రేషన్లు అయ్యాయని, అప్పటి నుంచి ఇక్కడే ఉంటున్నామని, రిజిస్ట్రేషన్లు చేసుకున్నప్పుడు, నిర్మాణాలకు అనుమతులిచ్చినప్పుడు, ఇంటి పన్ను కట్టించుకున్నప్పుడు, కరెంటు కనెక్షన్ ఇచ్చినప్పుడు, మంచి నీళ్ల బిల్లు కట్టుమన్నప్పుడు లేని అభ్యంతరాలు ఇప్పుడే ఎందుకు వస్తున్నాయని బాధితులు అడుగుతున్న ప్రశ్నలకు ప్రభుత్వం వద్ద సమాధానం ఉన్నదా? అని నిలదీశారు.

మొదట వారిపై చర్యలు తీసుకోండి

ప్రభుత్వానికి దమ్ముంటే, చేతనైతే వీటికి అనుమతినిచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. హైకోర్టు కూడా ఇదే చెప్పిందని గుర్తుచేశారు. 'కూల్చాల్సి వస్తే మొదట కూల్చాల్సింది హైడ్రా కమిషనర్ ఆఫీస్, ఆ తర్వాత జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం.. ఈ రెండూ నాలా మీద కట్టారు' అని తెలిపారు.

రాహుల్, ప్రియాంక ఎక్కడ?

మూసీ బాధితులు ఆక్రందనలు చేస్తుంటే కాంగ్రెస్ అధినాయకులు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ఎక్కడ? అంటూ కేటీఆర్ ప్రశ్నించారు. ఎన్నికలప్పుడు అశోక్‌నగర్‌లో చాయ్ తాగి, బిర్యానీ తిని ఓట్లు దండుకున్నారని దుయ్యబట్టారు. వారిప్పుడు ఏమయ్యారని నిలదీశారు. ఢిల్లీ పార్టీలను ఎప్పుడు గెలిపించినా గల్లీ ప్రజల ఆక్రందనలు ఇలానే ఉంటాయని ఉదహరించారు. 'మూసీ ప్రాజెక్టు వల్ల మురిసేది ఎంత మంది?, రిటర్న్ ఆన్ ఇన్వెస్ట్‌మెంట్ ఎంత?, మూసీ వల్ల ఒక్క ఎకరానికైనా సాగు నీరు వస్తుందా?, ఒక్క రైతుకైనా అదనంగా నీరందుతుందా? ఒక్క రిజర్వాయర్ అయినా వస్తుందా?.. ఏమీ లేకున్నా లక్షన్నర కోట్లు అంటే స్కాం కాదా' అంటూ కేటీఆర్ ప్రశ్నించారు. రాహుల్ గాంధీ కాళేశ్వరం బీఆర్‌ఎస్‌కు ఏటీఎం అన్నారని, మరీ మూసీ ప్రాజెక్టు కాంగ్రెస్‌కు ఏటీఎం కాదా? అని నిలదీశారు. ఇది దేశంలోనే అతి పెద్ద కుంభకోణం కాదా? అని ప్రశ్నించారు.

వాటికే అంతయితే..

నమామి గంగే ప్రాజెక్టుకు రూ.40వేల కోట్లు, సబర్మతి రివర్ ఫ్రంట్‌కు రూ.7,050 కోట్లు, యమున రివర్ ప్రాజెక్టుకు రూ.1000 కోట్లు ఖర్చయితే మూసీకి రూ.1.50 లక్షల కోట్లు ఖర్చటా? అని కేటీఆర్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. థేమ్స్ నది ప్రాజెక్టుకు రూ.40వేల కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. 'ఇందిరమ్మ రాజ్యంలో ఇండ్లు కట్టిస్తారని ఓట్లు వేశారు.. పేదల ఇండ్లు కూలగొడుతామని ముందే చెప్పి ఉంటే ఒక్కరంటే ఒక్కరు కూడా కాంగ్రెస్‌కు ఓటు వేస్తుండేనా?' అని ప్రశ్నించారు.

నీ జాగీరా

'అన్ని అనుమతులు తీసుకొని కట్టుకున్న ప్రజల ఇండ్లను కూలగొడుతామంటే బీఆర్‌ఎస్ ఉరుకోదు.. వారికి అండగా నిలబడుతాం. బుల్డోజర్లు వస్తే వాటికి ఎదురుగా మేమే నిలబడుతాం' అని కేటీఆర్ ప్రకటించారు. సమావేశంలో మాజీ మంత్రులు మహమూద్ అలీ, జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, ఎమ్మెల్సీ రవీందర్ రావు, బీఆర్‌ఎస్ నేతలు కార్తీక్‌రెడ్డి, తుల ఉమ పాల్గొన్నారు.

ఇల్లు అనేది ఎమోషన్

'పేద, మధ్య తరగతి వారికి జీవితకాలం చేసిన కష్టానికి ప్రతీరూపం ఇల్లు. ఇల్లు అనేది ఒక ఎమోషన్. ఆ కుటుంబం మొత్తం కలలుగనే ఒక సౌధం, అది నాలుగు ఇటుకలు, రెండు రాళ్లతో కట్టిన కట్టడం కాదు.. ఇల్లు అనేది జ్ఞాపకాల పొదరిల్లు' అని కేటీఆర్ గుర్తుచేశారు. 'ఇండ్లను నిర్దాక్షిణ్యంగా కూల్చివేస్తామంటే ఎంత బాధ ఉంటదో రేవంత్‌రెడ్డికి తెలియక పోవచ్చు కానీ నాకు తెలుసు. కేసీఆర్ కుటుంబం ఒక్కసారి కాదు.. రెండు సార్లు డిస్‌ప్లేస్ అయింది. నానమ్మకు చెందిన పోసాన్‌పల్లి అప్పర్ మానేరు డ్యాంలో 1940లో మునిగిపోతే చింత మడకకు వచ్చాం. అమ్మమ్మ గ్రామం మిడ్ మానేరులో మునిగిపోయింది. మా జ్ఞాపకాలు, ఇండ్లు అన్నీ అక్కడే పోయాయి' అని గుర్తుచేసుకున్నారు. ఊరు, ఇంటిలో అల్లుకున్న జ్ఞాపకాలు, ఆశలు, ఆకాంక్షల విలువ రేవంత్‌రెడ్డికి తెలియకపోవచ్చు అన్నారు. కాంగ్రెస్ వాళ్లు సునీల్ కనుగోలు డైరెక్షన్‌లో 500 మందిని సోషల్ మీడియాలో పెట్టి బాధితులంతా ఆక్రమణదారులని ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

కొనుక్కునే సంస్కృతి మీది..

ఐదు వేలు తీసుకొని మూసీ బాధితులు మాట్లాడుతున్నారంటూ మంత్రి శ్రీధర్‌బాబు చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. రూ.50 కోట్లకు పీసీసీ ప్రెసిడెంట్ పదవి, రూ.500 కోట్లకు సీఎం పదవి అమ్మకోవడం, మంత్రులు పర్సంటేజీలు పంచుకోవడం లాంటి కాంగ్రెస్ దిక్కుమాలిన అలవాట్లు ప్రజలకు ఉండవని ఎద్దేవా చేశారు. 'ఆత్మగౌరవం మీద కొడితే తెలంగాణ ప్రజలు తిరగబడుతరు.. వాళ్లు తిరగబడితే కాంగ్రెస్ వాళ్లు ఉళ్లలో తిరగలేని పరిస్థితి వస్తుంది' అంటూ హెచ్చరించారు. మంత్రి శ్రీధర్ బాబు మీద కొంత గౌరవం ఉండేదని, ఆయన మాటలతో గౌరవం పోయిందని చెప్పారు.

హనుమకొండ జిల్లా ఐనవోలులోని కేజీబీవీలో కరెంట్ పోవడంతో చీకటిగా మారిన గది

కలెక్టర్ సాక్షిగా 'కస్తూర్బా'లో కరెంట్ కట్

ఐనవోలు, సెప్టెంబర్ 30: హనుమకొండ జిల్లా ఐనవోలు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సోమవారం కలెక్టర్ ప్రావీణ్య ఉండగానే విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఆ సమయంలో కొన్ని క్లాసుల్లో విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. కలెక్టరే స్వయంగా ఆదేశించిన 20 నిమిషాల తరువాత విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించడం చర్చనీయాంశంగా మారింది.

3న ట్రిపుల్ ఆర్ బాధితుల మహాధర్నా

నల్లగొండ ప్రతినిధి, సెప్టెంబర్ 30 (నమస్తేతెలంగాణ) : ట్రిపుల్ ఆర్‌లో అలైన్‌మెంట్‌లో మార్పులు చేర్పులు, నష్టపరిహారం పెంపు తదితర డిమాండ్లతో ట్రిపుల్ ఆర్ బాధితులు ఆందోళనకు సిద్ధమవుతున్నారు. అక్టోబర్ 3న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా చేపట్టనున్నారు. వ్యవసాయ భూములు, ఇండ్లు, ప్లాట్లు, వాణిజ్య భవనాలు, ఇతర ఆస్తులను కోల్పోతున్న బాధితులంతా రైతు ఐక్యవేదికగా ఏర్పడి ఆందోళనకు సన్నద్ధమవుతున్నారు. చౌటుప్పల్, వలిగొండ, సంస్థాన్ నారాయణపురం, భువనగిరి తదితర మండలాల్లోని బాధితులతోపాటు గజ్వేల్, సంగారెడ్డి ప్రాంత నిర్వాసితులు కూడా తరలివచ్చేలా ప్రణాళిక సిద్ధం చేశారు. మహాధర్నాకు సంబంధించి ఇప్పటికే పోలీసుల నుంచి అనుమతి కూడా పొందినట్టు తెలిసింది. ఈ ధర్నాకు అన్ని ప్రధాన రాజకీయ పార్టీల రాష్ట్ర ముఖ్యనేతలతోపాటు రైతు సంఘాల నాయకులను ఆహ్వానిస్తున్నారు. సోమవారం విపక్ష పార్టీలకు చెందిన పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, కీలక నేతలను కలిసి మహాధర్నాలో పాల్గొనాలని కోరారు. తమకు సంఘీభావంగా తరలివచ్చి అలైన్‌మెంట్లలో మార్పులు చేర్పు లు, పరిహారం విషయంలో మార్కెట్ ధరకు అనుగుణంగా పరిహారం వచ్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని బాధితులు విజ్ఞప్తి చేశారు. మహాధర్నాకు పెద్దసంఖ్యలో తరలివెళ్లి ధర్నాచౌక్ దద్దరిల్లేలా చేసి ప్రభుత్వం దిగివచ్చేలా చేయడమే తమ లక్ష్యమని రైతు ఐక్య వేదిక ప్రతినిధులు పేర్కొన్నారు.

• తాగునీటి కోసం గిరిజనుల నిరసన

మూడు రోజులుగా మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం కోయగూడెంలోని పలు కాలనీలవాసులు సోమవారం నిరసన తెలిపారు. నీటి ట్యాంకు ఉన్నా.. పంపులు రాకపోవడంతో చేతి పంపులను ఆశ్రయించాల్సి వస్తుందని మహిళలు ఆవేదన వ్యక్తంచేశారు. – టేకులపల్లి

రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, షెడ్యూల్డ్ ట్రైబల్ కో-ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్

రైతులకు లాభాలు చేకూర్చే పనులు చేపట్టండి

బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

గుడిహత్నూర్, సెప్టెంబర్ 30 : ఎండనక, వాననక కష్టపడి పంటలు పండించే రైతులను దృష్టిలో పెట్టుకుని వారికి లాభాలు చేకూర్చే పనులు చేపట్టాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం గుడిహత్నూర్ మండలంలోని పూనగూడలోని ఆయిల్ మిల్‌ను షెడ్యూల్డ్ ట్రైబల్ కో–ఆపరేటీవ్ కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్య నాయక్‌తో కలిసి ఎమ్మెల్యే సందర్శించారు. మిల్లులోని యంత్రాలను ప్రారంభించారు. రైతులతో మాట్లాడి లాభ, నష్టాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇక్కడి రైతులు కూరగాయల సాగుకు అధిక ప్రాధాన్యతనిస్తూ కూరగాయలు పండిస్తున్నారు. స్టోరేజీ గోదాంలు ఏర్పాటు చేయాలన్నారు. టమాటా జ్యూస్ ఫ్యాక్టరీకి ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

పట్టాలిచ్చి.. సౌకర్యాలు కల్పించాలి..

ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా

ఎదులాపురం, సెప్టెంబర్ 30 : మావల మండల పరిధిలోని సర్వే 170లో గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్న వారికి పట్టాలతోపాటు సౌకర్యాలు కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. 2021–23లో మావల మేజర్ గ్రామ పంచాయతీలో ఉన్నప్పుడు 1200 మందికి పట్టాలివ్వడం జరిగిందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పట్టాలిస్తే డబుల్ బెడ్ రూం ఇస్తామని చెప్పడంతో కొందరు పట్టాలు తిరిగి ఇచ్చేశారన్నారు. కానీ.. ఇప్పటి వరకు వారికి డబుల్ బెడ్రూం ఇండ్లు ఇవ్వలేదన్నారు. ఇప్పుడు రెవెన్యూ అధికారులు కొందరికి పట్టాలు చేసి ఇస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం అక్కడ గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్న వారికి కరెంట్, తాగునీటి వసతి కల్పించాలని డిమాండ్ చేశారు. సర్వే నిర్వహించి స్థానికంగా ఉంటున్న వారికి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ముడుపు నళినిరెడ్డి, అరుణ్‌కుమార్, రమేశ్, కుంటాల రాములు పాల్గొన్నారు

పశువైద్యం.. దైవాధీనం

నార్నూర్ జబ్బుతో బాధపడుతున్న మేకలకు వాహనాల ఆయిల్ రాస్తున్న పశుపోషకుడు

నార్నూర్, సెప్టెంబర్ 30 : నార్నూర్‌లోని పశు వైద్యశాలలో మూగజీవాలకు పశువైద్యం అందని ద్రాక్షలా మారిందని పశుపోషకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వానకాలం సీజన్ కావడంతో మేకలు, గొర్రెలు, పశువులకు వ్యాధులు సోకుతున్నాయి. చికిత్స నిమిత్తం తీసుకెళ్తే ప్రభుత్వం మందులు సరఫరా చేస్తాలేదని సిబ్బంది చెబుతున్నారని పాడిరై తులు పేర్కొంటున్నారు. సకాలంలో వైద్యం అందక మృత్యువాత పడుతున్నట్లు ఆందోళనకు గురవుతున్నారు. వైద్యాధికారి కూడా ఎవరో తెలియని దుస్థితి. వెటర్నరీ అసిస్టెంట్ ఎప్పుడు వస్తోడో..ఎప్పుడు వెళ్తాడో దేవుడికే తెలియాలి. ఉదయం 11 గంటల తర్వాత వెళ్తే దవఖానాకు తాళం వేసి ఉంటుందని రైతులు ఆరోపిస్తున్నారు. గజ్జి సోకడంతో మందులు కొనుగోలు చేసుకోలేక పశువుల ప్రాణాలు కాపాడాటానికి వాహనాలకు వాడిన ఆయిల్‌ను మేకలకు రాస్తూ ఓ పశుపోషకుడు మండల కేంద్రంలోని అన్నాబావ్‌సాఠే నగర్‌లో సోమవారం కనిపించారు. ఇప్పటికైన సంబంధిత శాఖ అధికారులు స్పందించి మందుల కొరత లేకుండా చూడాలని వేడుకుంటున్నారు.

వాహనాలకు వాడిన ఆయిల్‌ను చూపిస్తున్న పశుపోషకుడు

గోలి శంకర్ మరణం పార్టీకి తీరని లోటు

ఎదులాపురం, సెప్టెంబర్ 30 : పార్టీ కోసం అహర్నిశలు పని చేసే గోలి శంకర్ వంటి కార్యకర్త మరణం తీరని లోటని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. ఇటీవల మృతి చెందిన గోలి శంకర్ సంతాప సభను పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. శంకర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. పార్టీ బలోపేతం కోసం ఆయన చేసిన కృషిని స్మరించుకుంటూ పలువురు నేతలు కన్నీటి పర్యంతమయ్యారు. బాధిత కుటుంబానికి అన్ని విధాల అండగా నిలవాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ గతేడాది గోలి శంకర్ చికిత్స పొందుతున్న సమయంలోనే మాజీ సీఎం కేసీఆర్‌ను ప్రత్యేకంగా కలిసి ఆయన భార్యకు ఉద్యోగం అందించే బాధ్యతను తీసుకున్నారని, ఎట్టి పరిస్థితుల్లో ఆమెకు ఉద్యోగం రావాలన్న ఉద్దేశంతో కృషి చేశామని గుర్తు చేశారు. తాజాగా గోలి శంకర్‌ను కలిసిన సమయంలోనూ ఆరోగ్యం గురించి వాకబు చేయడం జరిగిందని, చిన్న వయసులోనే ఆయన మృతి చెందడం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ అందరితో కలివిడిగా ఉండే గోలి శంకర్ మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. భవిష్యత్తులోనూ ఆయన కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు రోకండ్ల రమేశ్, అలాల్ అజయ్, విజ్జగిరి నారాయణ, యూనిస్ అక్బనీ, స్వరూప రాణి, నర్సింగ్‌రావ్, రంగినేని శ్రీనివాస్, బుట్టి శివ, సాజీదుద్దీన్ పాల్గొన్నారు.

శ్రద్ధాంజలి ఘటిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

డీఎస్సీ ఫలితాల్లో జిల్లా వాసుల ప్రతిభ

బోథ్/భైంసా/ఎదులాపురం/కడెం/సోన్/దస్తురాబాద్/బజార్‌హత్నూర్, సెప్టెంబర్ 30 : డీఎస్సీ ఫలితాల్లో జిల్లావాసులు ప్రతిభ కనబరిచారు. సోమవారం ప్రకటించిన ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్, ఎస్‌జీటీ ఉపాధ్యాయ పోస్టులకు అర్హత సాధించారు. నల్లపూర్ణ చందర్ రెడ్డి స్కూల్ అసిస్టెంట్ బయోసైన్స్‌లో ఆదిలాబాద్ జిల్లా స్థాయిలో ఒకటో ర్యాంకు సాధించాడు. కౌఠ(బీ)కి చెందిన సింగడి సాయిచందన స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్ విభాగంలో జిల్లా స్థాయిలో రెండో ర్యాంకు సాధించాడు. భైంసా మైనార్టీ గురుకుల పాఠశాలలో టీజీటీ సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పురిమిశెట్టి రవి స్కూల్ అసిస్టెంట్ విభాగంలో జిల్లా మొదటి ర్యాంకు సాధించాడు. ఆదిలాబాద్ పట్టణంలోని రాంనగర్ కాలనీకి చెందిన తాటి కిరణ్ ఎస్‌జీటీలో పదో ర్యాంకు సాధించారు. సోషల్ విభాగంలో కడెం మండలంలోని పెద్దూర్‌కు చెందిన చిటేటి నరేశ్‌కు నిర్మల్ జిల్లాస్థాయిలో రెండో ర్యాంకు సాధించాడు. ఉడుంపూర్ గ్రామానికి చెందిన బూరుగు వర్ణ బయోలాజికల్ సైన్స్‌లో ఐదో ర్యాంక్ సాధించారు. నరేశ్ 77.80 మార్కులతో రెండో స్థానం సాధించగా, వర్ణ 79.07 మార్కులతో 5వ సాధించారు. నిర్మల్ మండలంలోని వెంగ్వాపేట్ గ్రామానికి చెందిన గడ్డం లక్ష్మి–జీవన్‌ల కుమార్తె అనూష సోషల్ స్టడీస్‌లో స్కూల్ అసిస్టెంట్ విభాగంలో జిల్లాస్థాయిలో ఆరో ర్యాంకు సాధించింది. దస్తురాబాద్ మండలంలోని మున్యాల గ్రామానికి చెందిన బొడ్డు సుమలత నిర్మల్ జిల్లాస్థాయిలో రెండో ర్యాంక్‌ను సాధించింది. బజార్‌హత్నూర్ గ్రామవాసి పురిశెట్టి నర్సయ్య స్కూల్ అసిస్టెంట్ తెలుగు పండిత్‌గా జిల్లా టాపర్‌గా నిలిచాడు.

తండ్రి బడిలో స్వీపర్.. కూతురు కాబోయే టీచర్

తల్లిదండ్రులతో ఏలేటి జ్ఞాన ప్రగతి

తాంసి, సెప్టెంబర్ 30 : తాంసి మండలంలోని కప్పర్ల గ్రామానికి చెందిన ఏలేటి జ్ఞాన ప్రగతి కష్టపడి చదివి టీచర్ ఉద్యోగానికి అర్హత సాధించింది. పదో తరగతి వరకు కప్పర్ల ప్రభుత్వ పాఠశాల, ఇంటర్ ఆదిలాబాద్, బీఎడ్ కరీంనగర్, ఎంఏ తెలుగు సెంట్రల్ యూనివర్సిటీ హైదరాబాద్‌లో పూర్తి చేసి చేసింది. జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ (తెలుగు) మూడో ర్యాంక్ సాధించి టీచర్ ఉద్యోగానికి ఎంపికైంది. తండ్రి శంకర్ బడిలో స్వీపర్.. కాగా.. తల్లి నర్సమ్మ అంగన్‌వాడీ టీచర్‌గా పని చేస్తున్నారు.

కలెక్టర్ కార్యాలయంలో బతుకమ్మ వేడుకలు

నిర్మల్ అర్బన్, సెప్టెంబర్ 30: నిర్మల్ కలెక్టరేట్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. ఈ వేడుకల్లో మహిళలతో కలిసి కలెక్టర్ అభిలాష అభినవ్ పాల్గొన్నారు. డీఆర్డీఓ విజయలక్ష్మి, మహిళా అధికారులు, స్వయం శక్తి సంఘాల మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా మహిళలందరికీ కలెక్టర్ ముందస్తుగా బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

గిరిజనాభివృద్ధికి ట్రైకార్ కృషి

ఉట్నూర్, సెప్టెంబర్ 30: గిరిజనులను అన్ని రకాలుగా అభివృద్ధి పర్చేందుకు ట్రైకార్ కృషి చేస్తున్నదని తెలంగాణ రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ చైర్మన్(ట్రైకార్) తేజావత్ బెల్లయ్య నాయక్ అన్నారు. సోమవారం ఉట్నూర్‌లోని కుమ్రం భీం ప్రాంగణంలోని సమావేశ మందిరంలో ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజన సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు చెందాలన్నారు. ట్రైకార్ అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు ట్రైకార్ ఎన్నో కార్యక్రమాలు అమలు చేసినట్లు వెల్లడించారు. యూనిట్లకు సంబంధించిన అర్హులైన లబ్ధిదారులను గుర్తించి క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేసి సక్రమంగా మార్కెటింగ్ చేయాలన్నారు. ప్రణాళిక ప్రకారం చిన్న బడ్జెట్‌లో లోకల్ యూనిట్లను తయారు చేసి నివేదికలు పంపాలన్నారు. అంతకుముందు గుడిహత్నూర్ మండలం పూనగూడ గ్రామంలోని డీఎన్‌టీఎఫ్‌పీసీఎల్ ఆయిల్ మిల్ సందర్శించి మిషన్లు ప్రారంభించారు. అనంతరం రైతులు స్టోరేజ్ గోదాంలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్, బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్, ట్రైకార్ మేనేజర్ శంకర్‌రావ్, ఎస్‌ఎస్‌ఎం లక్ష్మీ ప్రసాద్, ఐటీడీఏ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనం చెల్లించాలి

ఎదులాపురం, సెప్టెంబర్ 30 : ప్రభుత్వ దవాఖానలో ఐహెచ్‌ఎఫ్‌ఎంఎస్ విభాగంలో శానిటేషన్ పేషెంట్ కేర్ సెక్యూరిటీ విభాగంలో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. స్పందించిన కమిషనర్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేశ్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పెరిక దేవీదాస్, జిల్లా కమిటీ సభ్యులు పండగ పొచ్చన్న, నాయకులు రమేశ్, రమాకాంత్, ఖలీల్, హరీశ్, సోమనాథ్, శేఖర్ దత్తు, దేవేందర్ పాల్గొన్నారు

జోగు ఆశన్న జ్ఞాపకార్థం అన్నదానం

ఎదులాపురం, సెప్టెంబర్ 30: పితృమాస పర్వదినాలు పురస్కరించుకొని మాజీ మంత్రి జోగు రామన్న అన్న జోగు ఆశన్న జ్ఞాపకార్థం రిమ్స్‌లో సంత్ శ్రీ అంబాడీ బాబా సేవ కేంద్రంలో సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జోగు రామన్న స్వయంగా ప్రజలకు అన్నం వడ్డించారు.

ప్రజావాణికి 59 దరఖాస్తులు

ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, సెప్టెంబర్ 30 : ప్రజావాణికి వచ్చే అర్జీలను పరిష్కరించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వివిధ మండలాల నుంచి వచ్చిన వారి నుంచి 59 అర్జీలను స్వీకరించామన్నారు. ఆయా శాఖలకు సంబంధించిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. నార్నూర్ మండలంలోని జామడ గ్రామానికి చెందిన ఆత్రం మారుతికి వీల్‌చైర్ అందించడం జరిగింది. అధికారులతో అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ఆయా శాఖలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అర్జీలపై సమీక్షించారు. ప్రజావాణిలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్యామలదేవి, ఆర్డీవో వినోద కుమార్ పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం వద్దు

నిర్మల్ అర్బన్, సెప్టెంబర్ 30 : ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ప్రజలు సమర్పించిన ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం వహించవద్దని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి విద్య, వైద్యం, రుణమాఫీ, వరద నష్టం, రెవెన్యూ, ధరణి సమస్యలపై ఫిర్యాదులను ఆమె స్వీకరించారు. ప్రజల అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటివరకు శాఖలవారీగా పెండింగ్‌లో ఉన్న సమస్యల దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. అనంతరం పెండింగ్‌లో ఉన్న ఆయా శాఖలవారీగా దరఖాస్తులను పరిష్కరించాలని ఆదేశించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ పాల్గొన్నారు.

అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నైపుణ్యాన్ని వెలికి తీయడానికే క్రీడాపోటీలు

గుడిహత్నూర్, సెప్టెంబర్ 30 : గ్రామీణ క్రీడాకారుల నైపుణ్యతను వెలికి తీయడానికే ఈ క్రీడాపోటీలు దోహదపడతాయని ఎస్పీ గౌష్ ఆలం అన్నారు. గుడిహత్నూర్ ఆదర్శ పాఠశాలలో సోమవారం పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నీని ప్రారంభించారు. క్రీడలు చురుకుదనం పెంచడంతోపాటు ఆరోగ్యంగా ఉంచుతాయన్నారు. యువత వ్యసనాలకు దూరంగా ఉంటూ లక్ష్యంతో ముందుకెళ్తే అనుకున్నది సాధించడం కష్టమేమికాదన్నారు. అంతకుముందు ఎస్పీ క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. జిల్లా నలుమూలల నుంచి 56 జట్లు వచ్చాయి. క్రీడాకారులకు అన్ని సౌకర్యాలు కల్పించారు. ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్, ఇచ్చోడ సీఐ భీమేశ్, ఎస్‌ఐలు పాల్గొన్నారు.